నేడు మెగా జాబ్‌మేళా

వికారాబాద్, జూన్ 22: జాబ్‌మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యువజన క్రీడలాధికారి హన్మంత్‌రావు తెలిపారు. ఈ నెల 23న వికారాబాద్‌లోని నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా ఉంటుందన్నారు. 60కంపెనీలు పాల్గొంటున్న ఈ మేళాలో 5వేల మందికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరవుతున్నారన్నారు. వివరాలకు 9642333668, 9030047303నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



అన్నదాత..కడుపు కోత

జిల్లాలో వడ్ల కొనుగోళ్లలో దోపిడీ పర్వం సాగుతోంది. కేంద్రాల వద్ద 40కిలోల బస్తాకు 2 నుంచి 3 కిలోల చొప్పున క్వింటాల్‌కు ఐదుకిలోల వరకు తరుగు తీస్తున్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే నాణ్యత పేరుతో మిల్లర్లు అక్కడా కోత విధిస్తున్నారు. కోత విధించిన ధాన్యంతో మిల్లర్లు రూ. కోట్లు వెనుకేసుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తూకం చేసిన ధాన్యానికి మిల్లులో రాసుకుంటున్న లెక్కలకు పొంతన లేకుండా పోయింది. ధాన్యం కొనుగోళ్లు పౌరసరఫరశాఖ ఆధ్వర్యంలో చేపట్టినా మిల్లర్లు చెప్పిందే వేదంగా మారింది. ధాన్యం అమ్మకాల ప్రక్రియలో మిల్లర్లు తరుగు తీయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

లక్ష్యానికి దూరంగా..

యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలో 11.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 5.32 లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. 129 కేంద్రాల్లో ఇప్పటికే 95 కేంద్రాలను మూసేశారు. తడిసిన ధాన్యం కూడా కొంటామని ప్రభుత్వం చెబుతుంటే అధికారులు, ఏజెన్సీలు మాత్రం కొర్రీలు పెడుతుండడంతో రైతులు బయట మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకుంటూ నష్టపోతున్నారు. ఎక్కువగా ధాన్యం అమ్మకాలు ఓపెన్ మార్కెట్‌లోనే జరిగాయి.

ధాన్యం కొనుగోళ్లలో నయా దోపిడీ

- మిల్లర్ల మాయలో సివిల్ సప్లయ్ శాఖ అధికారులు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద క్వింటాలుకు రెండు నుంచి ఐదు కిలోలు తరుగు పేరిట కోత
- మిల్లుల వద్ద 20 నుంచి 30 బస్తాల ధాన్యం కట్
- మిల్లర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట
- ధాన్యం అమ్మకాల్లో రైతుల పరిస్థితి నరకం
- ట్రక్‌షీట్‌తో పంపిస్తున్న ధాన్యం.. లోడ్లను తిరస్కరిస్తున్న మిల్లర్లు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

పరిగి, జూన్ 22: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పౌరసరఫరశాఖ ఆధ్వర్యంలో చేపట్టినా మిల్లర్లు చెప్పిందే వేదంగా మారింది. జిల్లాలో ప్రస్తుతం 129 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. వీటిలో సెర్ప్ ద్వారా 33 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 63, డీసీఎమ్మెస్ ద్వారా 27, ఏఎంసీల ద్వారా మూడు, ఎఫ్‌పీవో ద్వారా మూడు కేంద్రాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల ద్వారా 11.90 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు 5.32 లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు జాగ్రత్తతో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. మిల్లర్లు మాత్రం తమ దగ్గరకు వచ్చిన వడ్లు బాగాలేవనే సాకుతో వారు ఇష్టానుసారం నాణ్యత పేరుతో కోత పెడుతున్నారు. కేంద్రాల వద్ద 40 కిలోల బస్తాకు 2 నుంచి 3 కిలోల చొప్పున క్వింటాల్‌కు ఐదుకిలోల వరకు తరుగును తీస్తున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద తూకం చేసిన ధాన్యానికి మిల్లులో రాసుకుంటున్న లెక్కలకు పొంతన లేకుండా పోయింది. జిల్లాలో 11.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 5.32 లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు.అయితే ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ధాన్యంలో నాణ్యత పేరిట కోతతో మిల్లర్లు రూ. కోట్లలో లాభం గడించినట్లు తెలుస్తున్నది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యంలో వేల క్వింటాళ్ల వడ్లను దొడ్డిదారిన మెక్కేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా దొడ్డిదారిన నొక్కేసిన ధాన్యం విలువ రూ. కోట్లలో ఉంటుందని అంచనా. మిల్లర్లు పెద్ద మొత్తంలో అధికారుల సహకారంతో దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మిల్లర్లదే రాజ్యం

కొనుగోళ్లు, రవాణ ఇలా ఎన్నో ఒడిదుడుకుల మధ్య కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని తరలిస్తే అక్కడ మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై అన్‌లోడ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దోమ మండలంలో కొనుగోలు చేసిన లారీ ధాన్యాన్ని లోడ్ చేసి వికారాబాద్ పరిధిలోని ధన్నారం దగ్గరలో ఓ రైస్ మిల్లుకు తరలిస్తే ఏకంగా వంద బస్తాల వరకు నాణ్యతగా లేవని కోత పెట్టినట్లు తెలిసింది. దోమ మండలం బాసుపల్లి గ్రామానికి చెందిన చాకలి హన్మయ్య 226 బస్తాల ధాన్యం తీసుకెళితే 30 బస్తాలు నాణ్యత పేరిట కోత విధించారు. జంగం మల్లేశ్వరి 122 బస్తాలు తీసుకెళ్లగా 15 బస్తాలు, కుర్మ షైపాల్‌కు చెందిన 50బస్తాల్లో ఎనిమిది బస్తాలు, మరో రైతు చెందిన 197 ధాన్యం బస్తాల్లో ఐదు బస్తాల ధాన్యాన్ని తరుగు కింద తీసేశారు. ఇలా వందలాది మంది రైతుల వద్ద వేల క్వింటాళ్లలో ఏదో వంకతో మిల్లర్లు నాణ్యత కోత విధించారు. కులకచర్ల మండలానికి చెందిన ధాన్యం లోడులు మహబూబ్‌నగర్‌లోని మిల్లుకు తీసుకెళ్తే మిమ్మల్ని ఎవరూ తీసుకరమ్మరాని మిల్లర్లు చీవాట్లు పెడుతున్నారు. ఇలా మూడు, నాలుగు రోజుల తరబడి పడిగాపులు కాసినా లాభం లేకుండా పోతోంది. అన్‌లోడ్ చేయాలంటే వారు చెప్పిన విధంగా కోత విధించేందుకు ఒప్పుకుంటే ఒకే చెబుతున్నారు. ఈ విధంగా ఇలా ఒక్కోలారీకి 12 నుంచి 18 క్వింటాళ్ల వడ్లు తగ్గించేస్తున్నారు. దీంతో మిల్లర్లకు లారీలోడ్ ధాన్యంలో తరుగు పేరిట కోత విధించడంతో రూ.50 వేల వరకు అదనపు ఆదాయం వస్తోంది. దోమ మండలం బొంపల్లి కొనుగోలు కేంద్రం నుంచి లారీ ధాన్యాన్ని మిల్లుకు పంపించగా అందులో తరుగుపేరిట మిల్లర్ల ఏకంగా 15 క్వింటాళ్ల ధాన్యానికి కోత విధించారు. పరిగి, దోమ, కులకచర్ల, బొంరాసిపేట్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల నుంచి లారీల్లో ధాన్యాన్ని లోడ్‌చేసి ట్రక్‌షీట్‌తో మిల్లర్ల దగ్గరకు వెళితే వారు సున్నితంగా తిరస్కరిస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక తరుగు పేరిట కోతకు ఒప్పుకోవాల్సి వస్తుందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.117 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే రూ.89 కోట్లు మాత్రమే చెల్లింపులు చేశారు. ఇంకా రూ.20 కోట్లు చెల్లించాల్సి ఉంది.

నిర్వాహకులకు కష్టాలే..

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కూడా అష్టకష్టాలు పడుతున్నారు. ఒక పక్క రైతులకు సరిపడా గన్నీ బ్యాగులు అందించలేక, ధాన్యాన్ని తూకం వేయడంలో ఆలస్యం, మరో పక్క కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు రవాణ చేసే ప్రక్రియలో ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని గన్నీ బ్యాగులు రావడంతో ఎవరికి ఇవ్వకపోయినా చీవాట్లు తప్పడం లేదు. మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తే మిల్లర్లు నిన్నెవరూ పంపమన్నారంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.

రవాణా, గన్నీ బ్యాగుల్లోనూ అవినీతే..

ధాన్యం రవాణా, గన్నీ సంచుల సరఫరాలోనూ అవినీతి జరుగుతున్నది. జిల్లాలో 29 లక్షల వరకు గన్నీబస్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. అయితే అధికారులు చెబుతున్న లెక్కలకు, వాస్తవానికి పొంతన లేకుండా పోయింది. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లోనూ గన్నీసంచుల కొరత ఉంది. అధికారులు చెబుతున్న విధంగా జిల్లాలో 29 లక్షల గోనె సంచులు అవసరం. ఇందులో నగం కూడా లేవని తెలిసింది. ఏళ్ల తరబడి వినియోగిస్తున్న గోనె సంచులే దిక్కవడంతో వాటిలో సగం కూడా పనికిరాకుండా పోయాయి. ఇదిలా ఉండగా, గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం అమ్ముకునే వరకే రైతు బాధ్యత. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల నుంచి మిల్లులకు తరలించే బాధ్యత పూర్తిగా కాంట్రాక్టర్‌దే. ఇలా జిల్లాలో గోనె సంచుల తరలింపు, ధాన్యాన్ని మిల్లులకు చేరవేసేందుకు కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదారులు కూడా కొన్ని సందర్భాల్లో చేతులెత్తేయడంతో రైతులే స్వయంగా వాహనాల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. ఈ విధంగా రైతులు తరలిస్తుంటే, రవాణ గుత్తేదార్లు మాత్రం తాము చేసినట్లు రికార్డులు చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది.

బిల్లులు లేకుండానే డబ్బులు బదిలీ

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనేటప్పుడు రైతు వివరాలు, నాణ్యత నమోదు చేస్తారు. ఆ తర్వాత ఏజెన్సీ నిర్వాహకులు రైతులకు సంబంధించి బిల్లులు చేసి జిల్లాలోని పౌరసరఫరా శాఖకు పంపాల్సి ఉంటుంది. అయితే బిల్లులు చేయకుండానే జిల్లా స్థాయిలో పలుకుబడి, సిఫారసు ఉన్న రైతుల ఖాతాల్లోకి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అవుతున్నాయి. అదే సాధారణ రైతులకు అయితే బిల్లులు చేసినా రోజులు తరబడి ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. జిల్లాలో ఎక్కువగా ఇబ్రహీంపూర్, గోవిందాపూర్, మిట్టకోడూరు, సుల్తాన్‌పూర్, కులకచర్ల, అప్పాయిపల్లి, హస్నాబాద్, తుంకిమెట్ల, మెంట్లకుంట, నాగిరెవల్లి, చౌదర్‌పల్లి తదితర కేంద్రాల్లో ఎక్కువగా బిల్లులు చేయకుండానే ఆన్‌లైన్‌లో నమోదు ఆధారంగానే పేమెంట్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరుగుతున్నాయి.



తరుగు పేరిట ఆరు క్వింటాళ్ల ధాన్యం కోత



122బస్తాల వడ్లను విక్రయించా. ఒక్కో బస్తాకు రెండు కిలోలు తరుగు కింద తీశారు. అయితే రెండున్నర క్వింటాళ్ల వరకు తరుగు పోయింది. ఇదిలా ఉంటే, రైస్ మిల్లరు 15బస్తాలు నాణ్యత పేరిట కోత పెట్టారు. మొత్తం ఆరు క్వింటాళ్ల ధాన్యాన్ని తరుగు కింద తీసేశారు. దీంతో రూ.13 వేలకుపైగా నష్టపోయా. ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ జరుగుతున్నది. అధికారులు పట్టించుకుని రైతులకు న్యాయం చేయాలి.

-జంగం చంద్రమౌళి,రైతు,బాసుపల్లి,దోమ మండలం

కొనుగోలు కేంద్రాల్లో నిలువు దోపిడీ



ప్రభుత్వ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ జరుగుతోంది. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా తరుగు తీస్తున్నారు. 197 బస్తాలు ధాన్యాన్ని అమ్మగా తరగు కింద నాలుగు క్వింటాళ్లు, నాణ్యత లేదని ఆరు బస్తాల ధాన్యాని రైస్ మిల్లరు కట్ చేశారు. రూ.12 వేలు నష్టపోయాను.

- జి.అనంతయ్య, రైతు, బాసుపల్లి

రుణమాఫీ..

రైతు హ్యాపీ

- మేడ్చల్-మల్కాజిగి జిల్లాలో ఏడు వేల మంది అన్నదాతలకు లబ్ది

మేడ్చల్, జూన్ 22(ఆంధ్రజ్యోతి) : 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు తీసుకున్న రైతు రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్త చేస్తున్నారు. ఈమేరకు జిల్లా అధికార యంత్రాంగం అర్హుల జాబితా తయారు చేసేందుకు సన్నద్ధమవుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సుమారు 7 వేల మంది రైతులు రూ.2లక్షల రుణమాఫీకి అర్హులుగా ఉన్నారని, ఇందుకు రూ.40 కోట్ల వరకు నిధులు అవసరముందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తాజాగా ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో మరింత లోతుగా అన్నదాతల రుణ వివరాల సేకరణకు చర్యలు తీసుకోనుంది. ఒకట్రెండు రోజుల్లో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు సమాచారం. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వర్తింపునకు సంబంధించి ఎంత మంది రైతులు రూ.లక్షల్లోపు రుణాలు తీసుకున్నారు? ఏయే బ్యాంకుల్లో ఎంత మేర బకాయిలున్నాయనే సమగ్ర వివరాలతో రావాలని మౌఖికంగా బ్యాంకర్లను ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు ఒకేసారి రైతుల రుణమాఫీ పట్ల అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో ఉన్న బకాయిలు మాఫీ అయితే ఈ సీజన్‌లో కొత్తగా రుణాలు తీసుకునే అవకాశం ఉంటుంది.



డ్వాక్రా మహిళల అభ్యున్నతికి కృషి

- జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి



భవనాన్ని ప్రారంభిస్తున్న శరత్‌చంద్రారెడ్డి

శామీర్‌పేట, జూన్ 22 : జిల్లాలోని డ్వాక్రా మహిళల అభ్యున్నతికి బాధ్యతగా కృషి చేయడమే ధ్యేయమని జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. శనివారం మజీద్‌పూర్ గ్రామంలో డ్వాక్రా మహిళ సహకార సంఘం నూతన భవనాన్నిఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డ్వాక్రా మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా అనేక పథకాలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలను పొంది స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పి అంచలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఎంపీటీసీ ఆశోక్‌రెడ్డి, ప్రత్యేకాధికారి పూర్ణిమ, నాయకులు తుంకి రమేశ్, అబ్బగౌని బాస్కర్‌గౌడ్, వెంకటేశ్, సత్యవతి, నవనీత, కోడూరి నర్మద, వనజ, పాల్గొన్నారు.

పోలీసు అధికారులు

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 22 : పోలీస్ అధికారులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో వీక్లీ పరేడ్ సందర్భంగా పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. పరేడ్ కమాండర్ ఆర్‌ఐ అంజాత్ పాషా ఎస్పీకి గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. పోలీసు అధికారులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, నిత్యం వ్యాయామం కొరకు సమయం కేటాయించుకోవాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే సక్రమంగా విధులు నిర్వహించవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ యు.రవీందర్‌రెడ్డి, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్‌ఐ డేవిడ్ విజయ్‌కుమార్, ఆర్‌ఎస్‌ఐలు, వికారాబాద్ స్టేషన్, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

వికారాబాద్ జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డి శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఫిర్యాదుదారులతో ఓపికగా మాట్లాడాలి

పోలీస్ అధికారులు ఫిర్యాదుదారులతో ఓపికగా మాట్లాడాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. ఆయన కార్యాలయంలో అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించి ఓపికతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని, జిల్లా పోలీస్ శాఖకు మంచిపేరు తెచ్చేలా ప్రతీ ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుకు కృషి చేయాలని, రోడ్డు ఆక్సిడెంట్లు, సైబర్ నేరాలు, ఆత్మహత్య కేసులను తగ్గించుటకు అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో నమోదైన కేసుల్లో నిందితులకు శిక్షపడేలావిచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, కరుణసాగర్‌రెడ్డి, జానయ్య, వీరేశ్, సీఐలు, ఎస్సైలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

కీసరగుట్ట ఆలయ ఈవోగా సుధాకర్

కీసర, జూన్22: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఈవోగా సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా ఇన్‌చార్జి ఈవోగా కీసరగుట్టలో విధులు నిర్వహించిన నరేందర్ అమీర్‌పేటలోని కనకదుర్గ ఆలయం ఈవోగా పూర్తి బాధ్యతలతో బదిలీపై వెళ్లగా, కీసరగుట్ట ఈవోగా సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుధాకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ప్రధాన అర్చకుడు బలరాం శర్మ ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సత్యనారాయణ శర్మ, అధికారులు నారాయణ, వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుధాకర్


కేంద్ర మంత్రి పదవిని ఆశించలేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో లేను
- ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



స్వచ్ఛ్ ట్రక్కును ప్రారంభిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు/యాలాల జూన్ 22 : "నేను కేంద్ర మంత్రి పదవిని ఆశించలేదు. కేంద్ర మంత్రి అయి ఉంటే ప్రజలకు సమయం ఇచ్చే అవకాశం లభించేది కాదు. ఎన్నికలప్పుడే వచ్చేవాడిని" అని చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం తాండూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో లేనని, అధ్యక్ష పదవి కావాల్సినంత నాలెడ్జ్ తనకు లేదని పేర్కొన్నారు. అధ్యక్ష పదవి ఉండేవారికి అన్ని జిల్లాల నాయకులు తెలిసి ఉండాలని, రాజకీయంగా బాగా అనుభవం ఉన్న వ్యక్తులు ఆ హోదాకు అర్హులని తెలిపారు. తాను రాజకీయాల్లోకి వచ్చి పదేళ్లయిందని ఇంకా అధ్యక్ష పదవి ఆశించే స్థాయికి వెళ్లలేదన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛత పాటించే విధంగా సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు పట్టించుకుంటామని తర్వాత అభివృద్ధి విషయంలోనే పార్టీలకతీతంగా కలిసి పనిచేస్తామని ఆయన అన్నారు. అంతకు ముందు తాండూరు ప్రభుత్వ పాఠశాలలో జస్టిస్ కొండా మాధవ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ్ ట్రక్కును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క మండలంలోని 30 పాఠశాలల్లో టాయిలెట్స్ క్లీనింగ్‌కు ట్రక్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యు. రమేష్, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, కృష్ణముదిరాజ్, జుంటుపల్లి వెంకట్, సాహు శ్రీలత, అంతారం లలిత, బాలి శివకుమార్, గాజుల శాంత్ కుమార్, బొప్పి శ్రీహరి, బంట్వారం భద్రేశ్వర్ పాల్గొన్నారు. కాగా జుంటుపల్లి ప్రాజెక్టును ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ప్రాజెక్టు తూములను పరిశీలించి మరమ్మతుకు నిధులను మంజూరుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రామస్వామి ఆలయంలో పూజలు చేశారు.










శిఖర స్కూల్‌లో ఏడాది పాటు
తొమ్మిదో తరగతి రద్దు

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా దుండిగల్-గండి మైసమ్మ మండలంలోని బౌరంపేటలో గల శిఖర స్కూల్(ఇంటి నెంబర్ 6-7/5/4)'లో తొమ్మిదో తరగతిని ఏడాది పాటు సస్పెండ్(రద్దు) చేస్తున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) రీజినల్ ఆఫీసర్ శేఖర్ చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ అఫిలియేషన్ కోసం దరఖాస్తు(అప్లికేషన్ నెంబర్ 90828-2324) చేసిన సందర్భంలో ఆ స్కూలు యాజమాన్యం... తమ పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకే విద్యార్థులు చదువుతున్నట్లు సమాచారమిచ్చిందని వివరించారు. కానీ, ఆ ఎనిమిదో తరగతి పిల్లలను తొమ్మిది, పదో తరగతులకు ప్రమోట్ చేసిన వివరాలను తమకు వెల్లడించలేదని తెలిపారు. నిజానికి 1.4.2023 నుంచి తొమ్మిదో తరగతిని ప్రారంభించడానికి 2023 జూన్ 25న ప్రత్యేక షరతులతో సీబీఎస్ఈ అఫిలియేషన్‌ను మంజూరు చేశామని పేర్కొన్నారు. తొమ్మిదిలో ఉత్తీర్ణులైనవారిని 1.4.2024 నుంచి పదో తరగతికి ప్రమోట్ చేసేలా అనుమతి ఇచ్చామన్నారు. కానీ, ఆ స్కూలు యాజమాన్యం నిబంధనలను పాటించకుండా తొమ్మిది, పదో తరగతులకు విద్యార్థులను ప్రమోట్ చేశారని తెలిపారు. ఈ దృష్ట్యా 1.4.2024 నుంచి ప్రారంభమయ్యే అకాడమిక్ సెషన్‌లో తొమ్మిదో తరగతిలో విద్యార్థులను చేర్చుకోవద్దంటూ ఆదేశించామని వివరించారు. అంటే.. ఏడాది పాటు(31.3.2025 వరకు) తొమ్మిదో తరగతిని రద్దు చేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. కాగా, 2023లో తొమ్మిదో తరగతిలో రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులను 2025 ఫిబ్రవరిలో జరిగే సీబీఎస్ఈ పరీక్షలకు అనుమతిస్తున్నామని పేర్కొన్నారు.







డాక్టర్ లేకపోతే..
వైద్యమందేదెలా?

- విధుల పట్ల అలసత్వం.. రోగుల ఇక్కట్లు
- ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు చుట్టపు చూపుగా వచ్చిపోతున్న వైద్యురాలు
- చికిత్స కోసం వచ్చి వెనుదిరుగుతున్న రోగులు


వైద్యం కొరకు వచ్చిన రోగులు.. ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

చౌదరిగూడ, జూన్ 22 : అది పేరుకే ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి.. డాక్టర్ మాత్రం చుట్టపుచూపుగా వచ్చి వెళుతుంటారు. ఈ విషయమై గతంలో మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ముక్తకంఠంతో మండలంలో అసలు ఆయుర్వేద ఆస్పత్రి ఉందా?.. ఉంటే డాక్టర్ ఎక్కడా? అని ప్రశ్నల వర్షం కురిపించిన సందర్భాలూ ఉన్నాయి. ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు డాక్టర్ లేకపోవడంతో వెనుతిరిగి పోవడం మామూలైంది. ఈమేరకు శనివారం 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే.. ఆయుష్ పథకం కింద గతంలో మండల కేంద్రంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఏర్పాటు చేశారు. అయితే, అందులో విధులు నిర్వహించే వైద్యురాలు అందుబాటులో ఉండటం లేదు. ఎప్పుడు చూసినా కుర్చీ ఖాళీగా దర్శనమిస్తోందని పలువురు రోగులు తెలిపారు. ఎప్పుడు ఆసుపత్రికి వచ్చినా ఫార్మసిస్టే మందులు ఇస్తాడని, వైద్యురాలు శీలారాణి కనిపించదని వాపోయారు. ఓ వ్యక్తి మాట్లాడుతూ తాను ఏడాది కాలంలో మూడుసార్లు మాత్రమే డాక్టర్ ఉండటాన్ని చూశానని తెలిపాడు. ఆస్పత్రికి ఏ రోగి వచ్చినా నాలుగైదు రకాల మందులను ఫార్మసిస్టు అందించడమే నిత్యకృత్యంగా మారిందని రోగులు వాపోతున్నారు. కాగా, మండల కేంద్రంలో గురువారం సంత కోసం వచ్చిన కొందరు మాత్రమే మందులు తీసుకువెళ్తుంటారని సమాచారం. అయితే, ఆ రోజు కూడా డాక్టర్ ఇక్కడ వాష్‌రూం లేదంటూ మధ్యాహ్నమే వెళ్లిపోతుందంటూ పలువురు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందిగా మారనుంది. కాగా, విధులకు హాజరయ్యే డాక్టర్.. అటెండెన్స్ రిజిష్టర్‌లో వారం, పది రోజులుగా సంతకం చేయడం ఎలా మరిచిపోయిందో తెలియడం లేదు. ఆస్పత్రిలో లేకపోవడంపై డాక్టర్‌కు ఫోన్ చేస్తే.. కరెంట్ మీటర్‌కు డీడీ కట్టేందుకు వెళ్లినట్లు సమాధానమిచ్చింది. అయితే వారం క్రితమే డీడీ తీసుకోగా.. మీటర్ సైతం మంజూరు చేశామని, సిబ్బంది వేరే పనుల్లో బిజీగా ఉన్నందున ఫిట్టింగ్ చేయడం ఆలస్యమైందని ఏఈ రవికుమార్ తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో మీటర్ ఫిట్టింగ్ చేస్తామని ఏఈ తెలిపారు. అంతకుముందు ఆస్పత్రి సిబ్బంది(ఫార్మసిస్టు) డాక్టర్ ఎస్టీవోకు వెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా రోగులకు అందుబాటులో ఉండి చికిత్స అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.







అజీజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల అభివృద్ధికి కృషి : ఎంపీ

మొయినాబాద్ రూరల్, జూన్ 22: తనపై నమ్మకంతో కష్టపడి పనిచేసి అత్యధిక మెజారిటీతో రెండోసారి ఎంపీగా గెలిపించిన బీజేపీ శ్రేణులతో పాటు ప్రజలకు రుణపడి ఉంటానని, చేవెళ్ల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అజీజ్‌నగర్‌లో బీజేపీ జెండావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు కృషి చేస్తానని, తన గెలుపుకోసం కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు సన్‌వెళ్లి ప్రభాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తూర్పు మాధవరెడ్డి, మహేందర్‌రెడ్డి, కాంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కుమ్మరి మహేందర్, రాజుయాదవ్, కొండల్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారంలో నష్టం.. దోపిడీకి యత్నం

- విదేశాల్లో ఉద్యోగం వదిలి స్వదేశానికి..
- కుటుంబ పోషణకు ర్యాపిడో డ్రైవర్‌గా మారి.. ఆదాయం సరిపోక చోరీలకు యత్నం
- నగల దుకాణంలో దోపిడీ కేసులో జైలుకు.. నిందితుడితో పరిచయం.. రాబరీకి స్కెచ్.. పది చోట్ల రెక్కీ..
- మేడ్చల్‌లోని నగల దుకాణంలో రాబరీకి ప్రయత్నం బాధితుల ప్రతిఘటనతో 40 సెకండ్లలోనే పరార్
- సీసీ పుటేజీ సాయంతో 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
- ఇద్దరి అరెస్టు.. పరారీలో మరో వ్యక్తి : సీపీ అవినాష్ మహంతి



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివి, అమెరికాలో ఉద్యోగం చేసిన వ్యక్తి నగరానికి వచ్చి వ్యాపారం ప్రారంభించాడు. వ్యాపారంలో నష్టం రావడంతో ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేశాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు నగల దుకాణంలో దోపిడీకి యత్నించి పోలీసులకు పట్టుబడ్డాడు. జైలులో పరిచయమైన నేరగాడితో కలిసి దోపిడీకి పథకం వేశాడు. అయితే, పోలీసులకు పట్టుబడకుండా నిందితులు వేసిన ఎత్తులను ఖాకీలు చిత్తుచేశారు. దోపిడీకి యత్నించిన 24 గంటల్లోనే ఇద్దరు నిందితులను సైబరాబాద్ పోలీసుల అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీపీ అవినాష్ మహంతి, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డితో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. జైలులో పరిచయమైన పాత నేరస్తులు కలిసి దోపిడీకి పథకం వేశారని, గుర్తుపట్టకుండా ఉండేందుకు పలు ఎత్తులు వేశారని.. కానీ, పోలీసుల దర్యాప్తులో వారిని పట్టుకున్నామన్నారు. మహారాష్ట్రకు చెందిన నజీమ్ అజీజ్ కొరాడియా(36) చదువు పూర్తి చేసుకొని ఆఫ్రికా, చైనా, అమెరికాల్లో ఉద్యోగం చేశాడు. అతడి తల్లిదండ్రులు అమెరికాలో ఉన్నారు. అమెరికా నుంచి నగరానికి వచ్చి కొంపల్లిలో ఉంటూ వ్యాపారం చేసేవాడు. అతడికి పెళ్లై కుమారుడు కూడా ఉన్నాడు. వ్యాపారంలో భారీ నష్టాలు రావడంతో కుటుంబ పోషణ కోసం ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేయడం ప్రారంభించాడు. ఆదాయం పెంచుకోవడానికి రెండు బైకులు కొనుగోలు చేసి ఇద్దరు యువకులతో ర్యాపిడో డ్రైవర్లుగా పనిచేయించేవాడు. ఇలా వచ్చిన ఆదాయం సరిపోకపోవడంతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నగల దుకాణంలో చోరీ చేయాలని పథకం పన్నాడు. చాదర్‌ఘాట్‌లోని ఓ నగల దుకాణంలో యజమానిపై కత్తితో దాడిచేసి, నగలు తీసుకొని పరారయ్యాడు. ఈ కేసులో హైదరాబాద్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈక్రమంలో జైలులో మరో నిందితుడు షేక్ సొహైల్ పరిచయమయ్యాడు. ఇద్దరూ కలిసి దోపిడీలు ఎలా చేయాలనే విషయంపై జైలులో చర్చించుకునేవారు. నజీం, సొహైల్‌లు జైలు నుంచి విడుదలయ్యాక కలుసుకున్నారు. నగల దుకాణంలో దోపిడీ చేయాలని పథకం వేసుకున్నారు. దోపిడీకి పథకం వేసిన వీరిద్దరూ నగరంలో కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట, ఉప్పల్, బోడుప్పల్, కార్వాన్, బోరబండ, వెస్ట్ మారేడ్‌పల్లి, మలక్‌పేట్, అంబర్‌పేట్, మేడ్చల్‌లో ఉన్న నగల దుకాణాలను గుర్తించారు. ఆయా దుకాణాల వద్ద పరిస్థితులను గమనించేందుకు పలుమార్లు రెక్కీ నిర్వహించారు. మేడ్చల్‌లో ఉన్న దుకాణాన్ని టార్గెట్ చేశారు.

పోలీసులకు చిక్కకుండా పథకం

ఇప్పటికే కేసులో అరెస్టై జైలుకు వెళ్లిన అనుభవం ఉన్న ఇద్దరూ పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీస్ దర్యాప్తు గురించి బాగా అధ్యయనం చేసి, ముఖం గుర్తు పట్టకుండా ఉండేందుకు బురఖా, హెల్మెట్, గ్లవ్స్ కొనుగోలు చేశారు. దోపిడీ కోసం హబ్సిగూడలో పల్సర్ బైకును చోరీ చేశారు. తమ కదలికలు సీసీ కెమెరాల్లో చిక్కకుండా ఉండేందుకు బైకును రెండు రోజులముందే మేడ్చల్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో నిలిపి ఉంచారు. మరో నిందితుడు సల్మాన్ సాయంతో అశోక్ లేలాండ్ వాహనంలో మేడ్చల్‌లో వాహనం పార్కింగ్ చేసిన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి నుంచి బైకుపై టార్గెట్ చేసిన నగల దుకాణం వద్దకు చేరుకున్నారు.

40 సెకన్ల దోపిడీలో ట్విస్టులు

ముఖాన్ని గుర్తించకుండా ఉండేందుకు నజీం బురఖా ధరించగా, సొహైల్ హెల్మెట్ ధరించి జగదాంబ జ్యువెలర్స్ దుకాణంలో ప్రవేశించారు. దుకాణంలో కస్టమర్లు లేకపోవడంతో యజమానిపై కత్తితో దాడిచేసి దోపిడీకి యత్నించారు. దుకాణ యజమాని కుమారుడు అప్రమత్తమై కేకలు వేయడంతోపాటు ఎదురుదాడికి యత్నించడంతో అక్కడి నుంచి బైకుపై పరారయ్యారు. మేడ్చల్ నుంచి నిజామాబాద్ వైపుకు వెళ్లి రోడ్డుకు పక్కగా బైకును నిలిపి సల్మాన్ ఆటోలో పరారయ్యారు. పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఉండటం, ఫిర్యాదు రావడంతో నిమిషాల వ్యవధిలోనే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించినా వారి ఆనవాళ్లు కనిపించలేదు. అయితే, ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న సీపీ నిందితులను పట్టుకునేందుకు మేడ్చల్, దుండిగల్ పోలీసులు, మేడ్చల్, బాలానగర్ సీసీఎస్, మేడ్చల్, బాలానగర్ ఎస్వోటీ పోలీసులతో కలిపి మొత్తం 16 బృందాలను రంగంలోకి దించారు.

చోరీ బైకు ఆధారంగా దర్యాప్తు

సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల గురించి తెలుసుకోలేకపోయిన పోలీసులు దోపిడీకి వినియోగించిన బైకును స్వాధీనం చేసుకున్నారు. బైక్ వివరాలు సేకరించిన పోలీసులకు హబ్సిగూడలో చోరీ అయిందని గుర్తించారు. బైక్ చోరీ జరిగిన ప్రాంతంలో ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. దాదాపు 200 పైగా సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టిన పోలీసులు, నిందితుల జాడను గుర్తించారు. నాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అజీజ్ కొరాడియా, షేక్ సొహైల్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి పల్సర్ వాహనం, బురఖా, గ్లవ్స్, బ్యాగ్ రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

జాతీయ స్థాయి 'ఇన్‌స్పైర్'కు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు

వికారాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనకు వికారాబాద్ జిల్లా నుంచి రెండు ప్రదర్శనలు ఎంపికయ్యాయి. ఈనెల 14, 15వ తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం 26 ప్రదర్శనలను జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయగా, జిల్లా నుంచి రెండు ప్రదర్శనలు ఎంపిక కావడం విశేషం. చౌడాపూర్ మండలం, మరికల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి విశాల్ రూపొందించిన ఆటోమెటిక్ సేఫ్టీ ఎలక్ట్రిక్ పోల్, దోమ మండలం, దాదాపూర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి పోలేపల్లి యశ్వంత్‌గౌడ్ తయారుచేసిన పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్ ప్రదర్శనలను ఎంపిక చేశారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఇన్‌స్పైర్-మనక్ ప్రదర్శనలో జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. ఈమేరకు విశాల్, యశ్వంత్‌గౌడ్, గైడ్ టీచర్లు జి.రవికుమార్, శాంతకుమార్, ప్రధానోపాధ్యాయులు సర్వమంగళ, అమర్‌నాథ్‌లను డీఈవో రేణుకాదేవి, జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్‌లు అభినందించారు.



ఆటోమెటిక్ సేఫ్టీ ఎలక్ట్రిక్ పోల్ ప్రాజెక్టుతో విద్యార్థి విశాల్

జాతీయస్థాయి ప్రదర్శనలో జిల్లా సత్తా చాటేలా సంసిద్ధం కావాలని వారు సూచించారు.

వర్షాకాలంలో కరెంట్ స్తంభాలకు కరెంట్ ప్రసారమై జంతువులు, మనుషులు విద్యుదాఘాతానికి గురై చనిపోతూ ఉంటారు. ఇలాంటి ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించేందుకు మరికల్ జడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి విశాల్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు జి.రవికుమార్ మార్గదర్శకత్వంలో ఆటోమెటిక్ సేఫ్టీ ఎలక్ట్రిక్ పోల్ ప్రాజెక్టును అభివృద్ధి పరిచారు. విద్యుత్ స్తంభాల వద్ద కరెంట్‌షాక్‌కు గురికాకుండా ఉండేందుకు ఎలక్ట్రికల్ పోల్ వద్ద కాపర్ తీగను అర్డినో, ఐఆర్ సెన్సార్, ఇన్సులేటర్లు, బ్యాటరీ తదితర పరికరాలను అమర్చి వర్షం కురిసినప్పుడు పోల్ వద్ద షాక్ నుంచి రక్షించే వ్యవస్థను రూపొందించాడు. జడ్పీహెచ్‌ఎస్ మరికల్ పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ ప్రదర్శన జాతీయ స్థాయికి ఎంపిక కావడం వరుసగా ఇది రెండోసారి. గతేడాది నీటిని ఇంధనంగా మార్చుకొని నడిచే వాహనాన్ని రూపొందించిన విషయం తెలిసిందే.

భవన నిర్మాణ రంగంలో నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత కొంత వరకు అధిగమించేందుకు పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్ ఉపయోగపడనుంది. తాపీ మేస్త్రీకి సిమెంట్ కలపడానికి నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం. కాగా, భవన నిర్మాణాలు ఎక్కువ సంఖ్యలో కొనసాగుతుండడంతో కార్మికుల కొరత ఏర్పడుతోంది. సిమెంట్ కలవడానికి అవసరమయ్యే కార్మికుల పని పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్‌తో చేయవచ్చు. బేస్‌ఫ్రేమ్, డ్రైనింగ్ ఫ్రేమ్, కంటైనర్, పెడల్, చక్రంతో పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్ రూపొందించారు. బేస్‌ఫ్రేమ్ మొత్తం బరువు కలిగి ఉంటుంది. లిఫ్టింగ్ ఫ్రేమ్ కంటైనర్‌తో స్థిరంగా ఉంటుంది. ఇది సిమెంట్ కలపడానికి ఉపయోగపడుతుంది. కంటైనర్ సిమెంట్, ఇసుక, నీటిని మిక్సింగ్ చేస్తుంది. కంటైనర్ చక్రాల గేర్‌తో జతపరిచారు. ఇది సైకిల్ చైన్‌కు, సైకిల్ పెడల్‌తో జతచేశారు. పెడల్‌ను తిప్పినప్పుడు గొలుసు కంటైనర్‌ను తిప్పుతుంది. తద్వారా కంటైనర్‌లోని సిమెంట్, కంకర, నీరు మిక్స్ అవుతుంది. తాపీ మేస్త్రీకి ఎంతగానో ఉపయోగకరంగా ఉండే ఈ టూల్ నిర్వహణకు నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం లేదు. ఎవరైనా దీంతో సిమెంట్‌ను కలపవచ్చు. భవన నిర్మాణం పనుల్లోనే కాకుండా ఇతర సిమెంట్ పనులకు కూడా దీనిని ఉపయోగించవచ్చు. దోమ మండలం, దాదాపూర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి పోలేపల్లి యశ్వంత్‌గౌడ్ యంత్రాన్ని తయారు చేశారు.



పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్‌తో యశ్వంత్‌గౌడ్, గైడ్ టీచర్ శాంతకుమార్

రాచకొండ కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హైదరాబాద్ సిటీ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్‌లో పలువురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీచేస్తూ సీపీ తరుణ్‌జోషి ఆదేశాలు జారీచేశారు. సైబర్‌క్రైం విభాగంలో పనిచేస్తున్న ఎ.వెంకటయ్యను కీసర ఎస్‌హెచ్‌వోగా, కీసర ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న కె.సీతారామ్‌ను కందుకూరు ఠాణాకు, కందుకూరు ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న మక్బూల్‌జానీని సైబర్‌క్రైం విభాగానికి, యాదాద్రి ట్రాఫిక్ విభాగానికి చెందిన కె.నాగరాజును మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు, హయత్‌నగర్ డీఐ కె.శ్రీనివాస్‌ను మహేశ్వరం ఎస్వోటీకి బదిలీచేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, జూన్ 22 : మాజీ సీఎం కేసీఆర్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు శనివారం రాత్రి ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన తర్వాత కేసీఆర్‌ను కలిసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయనతో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అనంత్‌రెడ్డి తదితరులున్నారు.

ఆలయాలకు పాలక మండళ్లు ఏర్పాటు చేయాలి

- మంత్రి సురేఖకు విన్నవించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూన్ 22 : తాండూరు నియోజకవర్గంలోని ప్రసిద్ధిచెందిన పలు దేవాలయాలకు వెంటనే పాలక మండళ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు విన్నవించారు. ఈమేరకు మంత్రికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఆలయాలకు చైర్మన్, సభ్యులను ఏర్పాటు చేయాల్సిందిగా ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. స్పందించిన సురేఖ ఆలయాల అభివృద్ధికి కావాల్సిన నిధులు కేటాయించి పాలక మండళ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు.



మంత్రి సురేఖకు వినతిపత్రం ఇస్తున్న మనోహర్‌రెడ్డి

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

చేవెళ్ల, జూన్ 22 : మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి మందిరంలో శనివారం ఉదయం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా మందిరంలో 50మంది దంపతులు స్వామివారి వ్రతాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం దైవనామస్మరణతో మారుమోగింది. స్వామివారి వ్రతాల తర్వాత దంపతులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు. వ్రతాలు తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్



రంగారెడ్డి, సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు ఉన్నారు.

మంచాల పీఏసీఎస్ చైర్మన్‌గా హన్మంత్‌రెడ్డి



హన్మంత్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

మంచాల, జూన్ 22 : మంచాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం నూతన చైర్మన్‌గా వెదిరె హన్మంత్‌రెడ్డి ఎన్నికయ్యాడు. శనివారం నిర్వహించిన పీఏసీఎస్ మధ్యంతర చైర్మన్ ఎన్నికలో భాగంగా కాంగ్రెస్‌కు చెందిన హన్మంత్‌రెడ్డి విజ యం సాధించారు. సహకార సంఘంలో జరిగిన కార్యకలాపాల్లో అక్రమ లావాదేవీల విచారణలో చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి ఇటీవల పదవిని కోల్పోయాడు. ఆ తర్వాత తాత్కాలిక చైర్మన్‌గా బొద్రమోని యాదయ్య నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులైన డైరెక్టర్లు ఆయనపై అవిశ్వాసం పెట్టడంతో నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. మొత్తం 13 మంది సభ్యుల్లో బుస్సు పుల్లారెడ్డిపై అనర్హత వేటు పడగా.. 12 మందితో ఎన్నిక నిర్వహించారు. కాంగ్రెస్ మద్దతుతో వెదిరె హన్మంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్, బీజేపీ మద్దతుతో కొంగర జనార్దన్‌రెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా ఏడుగురు సభ్యుల మద్దతుతో హన్మంత్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

ఈము రైతులకు అండగా ప్రభుత్వం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 22: నాబార్డు సంస్థ మాటలు నమ్మి నట్టేట మునిగిన ఈము పక్షుల పెంపకందారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు హామీ ఇచ్చారని తెలంగాణ రాష్ట్ర ఈము పక్షుల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈము రైతులు 15 ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. వ్యవసాయానికి అనుబంధంగా ఈము పక్షులను పెంచితే లాభాలు వస్తాయని శిక్షణ ఇచ్చిన నాబార్డు సంస్థ భరోసా.. బ్యాంకులు ఇచ్చిన అప్పుతో ఈము పక్షులను పెంచామని తెలిపారు. ఈము పక్షులకు మార్కెట్ లేకపోవడంతో రైతులు నష్టపోయారని, కొందరు ఆస్తులు అమ్ముకున్నారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు. ఇదే అంశంపై నివేదిక పొందిన ఏపీలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం వన్‌టైం సెటిల్మెంట్ చేసిందని, 50శాతం ప్రభుత్వం, 25శాతం రైతులు, 25శాతం బ్యాంకర్లు భరించేలా సమస్యను పరిష్కరించిందన్నారు. తెలంగాణలో సమస్యను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి దృష్టికి తేవడంతో మంత్రులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపారని, వన్‌టైమ్ సెటిల్మెంట్ చేయాలని మంత్రులు బట్టి, తుమ్మలను స్టేట్‌లెవల్ బ్యాంకర్ల సమావేశంలో కోరగా.. సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఆరేళ్లుగా తట్టెడు మట్టి పోయలే!

- పన్నుల వసూలు తప్ప.. అభివృద్ధి ఏది?
- వెక్కిరిస్తున్న 'అభివృద్ధి' శిలాఫలకాలు
- పోచారం మున్సిపాలిటీ విహారి కాలనీవాసుల ఆవేదన

ఘట్‌కేసర్, జూన్22: గత ఆరేళ్లుగా తమ కాలనీలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తట్టెడు మట్టిపోసిన పాపాన పోలేదని పోచారం మున్సిపాలిటీ విహారి కాలనీవాసులు ఆరోపించారు. శనివారం కాలనీలోని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు మున్సిపాలిటీ పాలకవర్గంపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్ల మున్సిపాలిటీ పాలకవర్గం హయాంలో ఎలాంటి చిన్న పనిని చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఎప్పుడో వేసిన బీటీ రోడ్లు నేడు మట్టిరోడ్లు అయ్యాయని వాపోయారు. సంవత్సరానికి రూ.20లక్షల ట్యాక్సులు చెల్లిస్తున్నామని, అయినా కూడా తమ కాలనీలో చిన్న అభివృద్ధి పని చేపట్టకుండా లక్షల రూపాయాలు పన్నుల రూపంలో పిండుకుంటున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కాలనీలో రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నామని.. పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటంటే లెవలింగ్ కలువలేదని చెప్పి చేతులు దులుపుకున్నారని వాపోయారు. కాంట్రాక్టర్ తప్పుచేస్తే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తాగడానికి చుక్క నీరు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌తోపాటు కౌన్సిలర్‌కు అనేక సార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు మూడు పనులకు శిలాఫలకాలు వేశాడని, అందులో ఏ ఒక్క పని చేపట్టలేదన్నారు. ఆ శిలాఫలకాలను తొలగించాలని, లేదంటే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు చూపాలి

కందుకూరు, జూన్ 22 : కందుకూరు రెవెన్యూ పరిధిలో గతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన సర్టిఫికెట్లను ఆధారం చేసుకొని వారికి కబ్జా చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడారు. 788, 107 సర్వేనెంబర్లలో పేదలకు గతంలో ఇళ్ల స్థలాలకు సంబంధించి సర్టిఫికెట్లను ఇచ్చారని గుర్తుచేశారు. కానీ, నేటికీ వారికి కబ్జా చూపలేదన్నారు. ఎ.కుమార్, ఆర్.శేఖర్, బి.బాల్‌రాజ్, సత్తయ్య, తదితరులున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



పరిగి,జూన్ 22: పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి శనివారం తిరుమల తిరుపతిలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధికి ఆకాంక్షించారు.

ఆలయాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి



ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, జడ్పీటీసీ

మూడుచింతలపల్లి, జూన్ 22: ఆలయాభివృద్ధే లక్ష్యంగా నూతన కార్యవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి, జడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డిలు అన్నారు. ఉద్దెమర్రిలోని అక్కన్నమాదన్న శ్రీవిష్ణు శివాలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగవైభవంగా ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. ఉద్దెమర్రిలోని అక్కన్నమాదన్న నిర్మించిన శ్రీవిష్ణు శివాలయం నూతన కమిటీ చైర్‌పర్సన్‌గా ఉమామహేశ్వరి, సభ్యులుగా రవీందర్‌గౌడ్, రాజిరెడ్డి, రమేశ్, ప్రధానర్చకుడు వెంకటేశ్వరశర్మలను నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ సుగుణ విష్ణుగౌడ్, వెంకటేశ్, బాల్‌నర్సింహులు, నర్సింహులు, లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలి

ఘట్‌కేసర్, జూన్ 22: సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్ కళాశాల మైదానంలో శనివారం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు రంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఘట్‌కేసర్‌లో సీనియర్ సిటిజన్లకు కార్యాలయం నిర్మాణంకోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని చైర్‌పర్సన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉరెల్లి వెంకట్‌రాంరెడ్డి, ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, కౌన్సిలర్ బర్ల శశికళ దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాంబండ గిరిప్రదక్షిణ

కులకచర్ల, జూన్ 22: పాంబండ రామలింగేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ శనివారం సాయంత్రం కొనసాగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రతీ నెల హిందు బంధువుల ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. ఈ సారి 18వ గిరి ప్రదక్షిణలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వర్షం కురుస్తున్నా గిరి ప్రదక్షిణలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు పాండు శర్మ దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పరిగి అభివృద్ధి

పరిగి, జూన్ 22: పార్టీలకతీతంగా పరిగి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో రూ.2.50లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కృష్ణ, వార్డు అధ్యక్షుడు నయూమ్, నాయకులు నాని, సాయి, జి.శ్రీనివాస్, వెంకటేశ్, కృష్ణ, నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ విభాగాల పరిశీలన



తడిచెత్తతో తయారు చేస్తున్న ఎరువును పరిశీలిస్తున్న మున్సిపల్ పాలకవర్గం

ఘట్‌కేసర్, జూన్ 22: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇన్ఫోసిస్‌లో తడి, పొడిచెత్తల నిర్వహణ, గ్యాస్‌తయారీ కేంద్రాలను మున్సిపాలిటీ పాలకవర్గం శనివారం పరిశీలించింది. మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమన్‌రెడ్డిల ఆధ్వర్యంలో కౌన్సిలర్లు ఇన్ఫోసిస్‌లో అమలు చేస్తున్న విభాగాలను పరిశీలించారు. తడిచెత్తతో గ్యాస్ తయారీ, మురుగునీటి శుద్ధితో మొక్కలకు నీరందించడం, మొక్కలకు అవసరమైన ఎరువులను తయారు చేయడం, చెత్త నుంచి ఎరువు తయారు చేయడం, ఎస్టీపీ వినియోగాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ విధానాలను మున్సిపాలిటీలో అమలు చేసేందుకు ఇన్ఫోసిస్ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నాపరాళ్ల తవ్వకాలపై నజర్

● మూడు లారీలు సీజ్ ● పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



నాపరాళ్లను తరలిస్తున్న లారీలను పట్టుకున్న తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, జూన్ 22: నాపరాళ్ల అక్రమ తవ్వకాలు, తరలింపుపై రెవెన్యూ అధికారులు నజర్ పెట్టారు. ఈ క్రమంలో బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, సిబ్బందితో కలిసి మండలంలోని జీవన్గి పరిసర ప్రాంత నాపరాళ్ల గనుల్లో శనివారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నాపరాళ్లను తరలిస్తున్న మూడు లారీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని సీజ్‌చేసి పోలీసులకు అప్పగించారు. అధికారుల సమాచారం ముందే పసిగట్టిన గని యజమానులు కొందరు నాపరాళ్ల గనుల్లో కోతకు ఉపయోగించే కటింగ్ మిషన్ల బ్లేడులను తొలగించి ఇళ్లకు తీసుకెళ్లారు.అక్కడక్కడా కటింగ్ మిషన్ల బ్లేడ్లు, ప్లాస్టిక్ నీటి పైపులు ఉండగా రెవెన్యూ సిబ్బంది తొలగించుకుని వెంట తీసుకెళ్లిపోయారు. ఇకపై గనులకు లీజులు లేకుండా, ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలపై నిరంతరం దాడులు నిర్వహిస్తామని తహసీల్దార్ వెల్లడించారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా తవ్వకాలు, తరలింపు జరిపితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ దాడుల్లో రెవెన్యూ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న కార్మికులు

నాపరాళ్ల గనుల్లో దాడులు జరిపి కంటింగ్ మిషన్ల బ్లేడు, పైపులను తొలగించుకుని వెంట తీసుకెళ్తున్న రెవెన్యూ సిబ్బంది బైక్‌ను గని కార్మికులు అడ్డుకున్నారు. అప్పటికే తహసీల్దార్ వెళ్లిపోవడంతో ఆయన వెనకే వెళ్తున్న రెవెన్యూ సిబ్బందిపై కార్మికులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయ నేతలు కొందరు పలుకుబడి ఉపయోగించి ఎలాంటి అనుమతులు లేకుండా ఏళ్లుగా నాపరాళ్లను తవ్వి వ్యాపారం చేస్తున్నారన్నారు. వారిని వదిలిపెట్టి బతుకుదెరువు కోసం పనిచేసుకుంటున్న పేద కార్మికులపై ప్రతాపం చూపిస్తారా? అంటూ రెవెన్యూ సిబ్బందిని నిలదీశారు. అప్పటికే పోలీసుల రాకను గమనించిన గని కార్మికులు అక్కడినుంచి వెళ్లిపోయారు.



రెవెన్యూ సిబ్బంది వాహనాన్ని అడ్డుకుని ఆగ్రహం వ్యక్తంచేస్తున్న గని కార్మికులు

కనుల పండువగా ఏరువాక పౌర్ణమి



వికారాబాద్: మద్గుల్ చిట్టంపల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు



మోమిన్‌పేట్: టేకులపల్లిలో ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్న రైతులు



పరిగి: పట్టణంలో అలంకరించిన ఎడ్లతో ఏరువాక ఉత్సవాలు

వికారాబాద్, జూన్ 22: వికారాబాద్ మునిసిపల్, మండల పరిధిలో ఏరువాక పౌర్ణమి వేడుకలు కనుల పండుగగా జరిగాయి. రైతులు పంటలు ప్రారంభించే ముందు వచ్చే తొలి పండుగ కావడంతో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో రైతులు కాడెద్దుల ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం కాడెద్దుల ఊరేగింపు, వాటితో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.


మోమిన్‌పేట్: మండలంలో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టేకులపల్లిలో ఏరువాక పండుగ సందర్భంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఎడ్లు, ఆవులు, గేదెలను రంగులతో అలంకరించి ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు. ఇళ్లలో చేసిన పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. పంట పొలాల్లో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. సాయంత్రం హనుమాన్ మందిరం నుంచి దుర్గమ్మ ఆలయం వరకు ఎడ్ల బండ్లతో డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

పరిగి: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రెండవ రోజు శనివారం పరిగితోపాటు వివిధ గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. వానాకాలం సీజన్ ఆరంభ సమయంలో వచ్చే ఈ పండుగకు రైతులు అత్యంత ప్రాధాన్యతను ఇస్తారు. శనివారం రైతులు తమ పశువులను నీటితో శుభ్రపరిచి రంగురంగులతో అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌కు విద్యార్థుల ఎంపిక



సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన విద్యార్థి విశాల్




దోమ: ఎంపికైన యశ్వంత్‌గౌడ్‌తో ఉపాధ్యాయుడు

కులకచర్ల, జూన్ 22: చౌడాపూర్ మండలం మరికల్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి విశాల్ జాతీయ స్థాయి సైన్స్‌ఫెర్‌కు ఎంపికయ్యాడు. కొత్తపల్లికి చెందిన విశాల్ స్థానిక ఉపాధ్యాయుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఆటోమెటిక్ సెఫ్టీ ఎలక్ట్రికల్ పోల్ ప్రాజెక్టు తయారు చేసి ఆన్‌లైన్‌లో సైన్స్‌ఫేర్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. త్వరలో జరిగే జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌లో పాల్గొననున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

దోమ: మండలంలోని దాదాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పాలెపల్లి యశ్వంత్‌గౌడ్ ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు శాంతకుమార్ తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి గాను శంకర మిల్లర్‌పై ప్రయోగం చేసి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ పోటీల్లో విజయం సాధించి జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికయ్యాడు. జులైలో ఢిల్లీలో జరగనున్నట్లు తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

వర్షాకాలం తగు జాగ్రత్తలు తీసుకోవాలి



ఎంపీడీవో కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, జూన్ 22: వచ్చే వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షాలు కురుస్తుండటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో సంబంధిత అందుబాటులో ఉంటూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. కురుస్తున్న వర్షపు నీరు నిల్వ ఉండకుండా మురుగు నీటి కాల్వలను శుభ్రం చేయించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు చేయాలన్నారు. కొత్త నీరు వచ్చే అవకాశం ఉండటంతో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీం తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం వాయిదా

బషీరాబాద్, జూన్ 22: బషీరాబాద్ గ్రామ పంచాయతీ తై బజార్(సంత) వేలంను వాయిదా వేసినట్లు కార్యదర్శి జయకార్ శనివారం తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్దీత తేదీ 22న తైబజార్ వేలం కోసం ఏర్పాట్లు చేయగా ఈ వేలానికి ఎవరూ హాజరుకాలేదన్నారు. ఈ వేలాన్ని వాయిదా వేస్తూ ఈనెల 26న గ్రామ పంచాయతీలో కార్యాలయంలో మళ్లీ వేలం నిర్వహిస్తామని తెలిపారు.

25న ధారూరు తైబజారు వేలం

ధారూరు, జూన్ 22: ధారూరు తైబజారు వేలాన్ని ఈనెల 25న మంగళవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అంజ్యానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 2024 నుంచి మార్చి 2025 వరకు గల కాలపరిమితికి తైబజారు వేలం వేస్తున్నామని ఆయన చెప్పారు. పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు తైబజారు వేలం ప్రారంభమవుతుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేలు దరావత్తు(డిపాజిట్) పంచాయతీకి జమ చేయాలని, వారికి పంచాయతీలో బకాయిలు ఉంటే వేలంలో పాల్గొనేందుకు అనుమతించేదిలేదని చెప్పారు.

'నకిలీ విత్తనాలపై కఠినంగా వ్యవహరిస్తాం



బషీరాబాద్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో వివరాలు నమోదు చేసుకుంటున్న ఏవో

బషీరాబాద్, జూన్ 22: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠినంగా వ్యవహరిస్తామని బషీరాబాద్ వ్యవసాయాధికారి సూర్యప్రకాష్ హెచ్చరించారు. బషీరాబాద్‌లోని రెండు ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్‌ను గుర్తించి రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణంలో పత్తి, వరి విత్తనాల నమూనాలను సేకరించి వివరాలు నమోదు చేసుకున్నారు. విత్తనాల నకిలీలను గుర్తించేందుకు నమూనాలను ల్యాబ్‌లకు పంపించి పరీక్షలు జరిపిస్తామన్నారు. నకిలీలను గుర్తించి ఉన్నతాధికారుల ఆదేశానుసారం విక్రయాలు జరిపే యజమానులపై చర్యలకు ఉపక్రమిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సభలను విజయవంతం చేయాలి

పరిగి,జూన్ 22: వరంగల్‌లో జూలై 7న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి సుభాష్ మాదిగ కోరారు. పరిగిలోని జరిగిన సన్నాహక సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30ఏళ్లు పూర్తి చేసుకుని, వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పుట్టిన రోజు సందర్భంగా ఆవిర్భావ ఉత్సవాలు, ఆత్మగౌరవ కవాతును నిర్వహించనున్నట్లు తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాలకు జిల్లా నుంచి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అశోక్, కె.నర్సింహులు, రాజు, జె.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్లను నియమించాలి

బొంరాస్‌పేట్, జూన్ 22: పాఠశాలల్లో విద్యావలంటీర్ల నియామక ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించాలని ఉపాధ్యాయ జేఏసీ నాయకులు బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్ అన్నారు. వారు శనివారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలల్లో విద్యావలంటీర్ల నియామక ప్రక్రియను ప్రారంభించడంతో పాటు పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలని కోరారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా..

● **శామీర్‌పేట:** తూంకుంట‌లోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో చేరేందుకు ఈనెల 24వ తేదీన శామీర్‌పేటలోని మినీ స్టేడియం గ్రౌండ్స్‌లో విద్యార్థులను మండల స్థాయిలో ఎంపిక చేయనున్నట్లు ఎంఈవో వసంతకుమారి తెలిపారు.

● **తాండూరు రూరల్:** ఉద్దండాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి శరత్‌ను అవమానించిన ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌కుమార్ శర్మపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, విద్యార్థి ప్రజాసంఘాల నాయకులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశార

● **బషీరాబాద్:** గ్రామంలో పరిశుభ్రత పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని మైల్వార్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ వై.వెంకటేష్ సూచించారు. మైల్వార్ గ్రామ పంచాయతీని శనివారం సందర్శించిన ఆయన కార్యదర్శి నర్సింహగౌడ్‌తో పలు అంశాలపై చర్చించారు. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు.

శామీర్‌పేట: యాడారంలో మెడిసిటీ ఆస్పత్రి వారు శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.డాక్టర్లు అంకుశ్, అనూష, సహజ, నిఖిత, వర్షా, వినయ్‌లు, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, చెవి, ముక్కు, గొంతు, గడ్డలు, తదితర పరీక్షలను చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రమీలదేవి, మెడిసిటీ మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

● **పరిగి/ కొడంగల్ :** మండలంలోని రాపోల్ ఫీడర్ విద్యుత్ మరమ్మతుల పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ ఎండీ ఖాజా తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాపోల్, పోల్కంపల్లి, ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అదేవిధంగా కొడంగల్ మండలంలోని రావుల్‌పల్లి, టేకుల్‌కోడ్, పెద్దనందిగామ, కొడంగల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నవీన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

● **మేడ్చల్ టౌన్:** విద్యుత్ వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించటానికి విద్యుత్ శాఖ అధికారులు ఈనెల 24నుంచి ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. మేడ్చల్ విద్యుత్ శాఖ పరిధిలోని పలు సబ్‌స్టేషన్‌లనుంచి సరఫరా చేస్తున్న విద్యుత్‌లో అంతరాయం కలగకుండా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● **పూడూరు:** గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సైబేజ్ ఆశా ప్రోగ్రాం ద్వారా మండలంలోని సోమన్‌గుర్తి, దేవనోనిగూడ, కెరవెళ్లి, సిరిగాయిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ కిట్‌ను పంపిణీ చేశారు. శనివారం ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వివిధ ఉపకరణాలు అందజేశారు. ఆనపురవ సురేష్, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్


అప్పులబాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 22: అప్పుల బాధ భరించలేక ఓ ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంబేద్కర్‌నగర్‌కు చెందిన గుండు నరేష్‌గౌడ్(36) కొంతకాలంగా ఈసీఐఎల్‌లో ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. కాగా ప్రింటింగ్ ప్రెస్ నిర్వహణకు అప్పులు తీసుకొచ్చాడు. ప్రింటింగ్ ప్రెస్ సక్రమంగా నడవకపోడంతో అప్పులు ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని తరచూ తన కుటుంబసభ్యులతో చెబుతూ బాధపడేవాడు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో నరేష్‌గౌడ్ బాత్‌రూంలోని ఇనుపరాడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు నరేష్‌గౌడ్ కుటుంబసభ్యులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య గొడవలో అన్న మృతి

మోమిన్‌పేట్, జూన్ 22: అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో అన్న మృతి చెందిన సంఘటన మోమిన్‌పేట్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాతకొల్కుంద గ్రామానికి చెందిన బండారి నర్సింహులు, శ్రీనివాస్(35), రాజశేఖర్ ముగ్గురు అన్నదమ్ములు. ఈ ముగ్గురికీ పెళ్లిళ్లు కాగా ఒకే ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి వేర్వేరు గదుల్లో ఉంటున్నారు. అయితే, శుక్రవారం రాత్రి తమ్ముడు రాజశేఖర్ ఇంటికి వచ్చేసరికి అన్న శ్రీనివాస్.. రాజశేఖర్ గది నుంచి బయటకు వస్తున్నాడు. దీంతో తన గది తాళాలు పగులగొట్టి డబ్బులు దొంగిలించాడనే అనుమానంతో శ్రీనివాస్‌తో రాజశేఖర్ గొడవకు దిగాడు. ఇద్దరూ 8గంటల ప్రాంతంలో గొడవపడగా ఇరువురిని అన్నయ్య నర్సింహులు మందలించడంతో ఎవరిగదిలోకి వారు వెళ్లారు. అనంతరం రాత్రి 10గంటలకు శ్రీనివాస్, రాజశేఖర్‌లు మళ్లీ గొడవపడ్డారు. రాజశేఖర్ కర్రతో దాడి చేయగా శ్రీనివాస్ తలకు, చేతులకు, కాళ్లకు, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. రాత్రిపూట అందరూ నిద్రిస్తుండటంతో శ్రీనివాస్‌ను ఎవరూ గమనించలేదు. ఉదయం చూసేసరికి శ్రీనివాస్ తీవ్రగాయాలతో కనిపించడంతో వారి అన్న నర్సింహులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్య స్వప్న భర్తతో మనస్పర్థలు రావడంతో నాలుగేళ్లుగా పిల్లలతో కలిసి తల్లి వద్దే ఉంటోంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సీఐ అంజనేయులు, ఎస్ఐ అరవింద్ తెలిపారు.

యువకుడు అదృశ్యం



కృష్ణయ్య

కులకచర్ల, జూన్ 22: మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామంలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన కృష్ణయ్య(30) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికారు. కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసినట్లు కులకచర్ల పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే 8712670044 సెల్‌నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

బొంరాస్‌పేట్, జూన్ 22: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు బొంరాస్‌పేట్ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. మండలంలోని బురాన్‌పూర్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ సంపాదించాలనే దురాశతో ఇద్దరు వ్యక్తులు శనివారం రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు ఆటోను ఆపి తనిఖీలు చేయగా 17క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైంది. ఈ మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని హుజురాబాద్‌కు చెందిన సంపత్, సిద్దిపేటకు చెందిన పోశెట్టిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.


ఎర్రమట్టి లారీల పట్టివేత

బషీరాబాద్, జూన్ 22: ఓవర్ లోడ్‌తో వెళ్తున్న నాలుగు లారీలను బషీరాబాద్ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఎర్రమట్టి ఎక్కడా తరలిస్తున్నారనే దానిపై పోలీసులు విచారించగా, కర్ణాటక రాష్ట్రంలోని ఓసిమెంట్ కంపెనీకి తరలిస్తున్న తేలింది. దీంతో లారీల్లో మట్టి తరలింపునకు అనుమతులు ఉండి ఓవర్ లోడ్‌తో వెళ్తుండటంతో జరిమానా విధించి వదిలిపెట్టినట్లు ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

బొంరాస్‌పేట్, జూన్ 22: విద్యుదాఘాతంతో ఓగేదె మృత్యువాతపడింది. ఈ ఘటన బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంటలో జరిగింది. గ్రామానికి చెందిన పాలేపల్లి లక్ష్మికి చెందిన గేదె రోజూ మాదిరిగా శనివారం మేతమేస్తుండగా బొంరాస్‌పేట్ పెద్ద చెరువు సమీపంలోని మెట్లకుంట శివారు బండోళ్ల పొలంలో బోరుబావికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందింది. మృత్యువాతపడిన గేదె విలువ దాదాపు రూ.70వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం తరఫున తనకు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

రూ.2లక్షల రుణమాఫీపై హర్షం



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూన్ 22: రాష్ట్రంలోని రైతులందరికీ గడువులోగా ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే జారీ కానున్నాయని అన్నారు. రైతుల తరఫున సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ధారూరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయటం హర్షణీయమని టీపీసీసీ ప్రధానకార్యదర్శి పి.రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతు రుణమాఫీ చేయాలని కేబినేట్ తీసుకున్న నిర్ణయం రైతులకు మేలు చేకూరుస్తుందన్నారు.


కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి పరామర్శ

తాండూరు రూరల్, జూన్ 22: కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు నాగప్పను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో హైదరాబాద్ మియాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగప్పను శనివారం ఎమ్మెల్యే ఆస్పత్రికి తీసుకెళ్లి పరామర్శించారు. ఆందోళన చెందవద్దని, తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కరణం పురుషోత్తంరావు తదితరులున్నారు.

కీసర సీఐ వెంకటయ్య బదిలీ నిలిపివేత

కీసర రూరల్, జూన్ 22 : కీసర సీఐ వెంకటయ్య బదిలీ నిలిపివేస్తూ శనివారం రాచకొండ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. చౌటుప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీతారాంను కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే, అనివార్య కారణాలతో బదిలీ ఉత్తర్వులను రద్దు చేస్తూ మరో ఆర్డర్‌ను కమిషనర్ వెలువరించారు. దీంతో కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటయ్యనే కొనసాగిస్తున్నట్లు శనివారం మరో ఉత్తర్వు ద్వారా స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన మేడ్చల్ నాయకులు



ఎమ్మెల్యే మల్లారెడ్డితో మేడ్చల్ నాయకులు

మేడ్చల్ టౌన్, జూన్ 22 : మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని మేడ్చల్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి ఇంటికి వెళ్లిన నేతలు పార్టీ పరిస్థితుల, పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, డబీల్‌పూర్ మాజీ సర్పంచ్ వీర్లపల్లి రాజమల్లారెడ్డి, డబీల్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, నాయకులు హరాత్‌రెడ్డి, యూనూస్‌పాషా, భాస్కర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

గౌతాపూర్-కరన్‌కోట్ రోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్, జూన్ 22 : తాండూరు మండలం గౌతాపూర్-కరన్‌కోట్ మధ్య ప్రధాన రహదారి పనులు శనివారం ప్రారంభించారు. ఈ పనులను కరన్‌కోట్ ఎంపీటీసీ రాజ్‌కుమార్ పలువురు నాయకులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు సుధాకర్, భరత్‌కిషోర్, అనిల్ శ్రీనివాస్‌గౌడ్, పనులను పర్యవేక్షించిన వారిలో ఉన్నారు.